క్లుప్తంగా

27 నుంచి 'జగనన్నే మా భవిష్యత్'

పరవాడ: మండలంలో రెండో విడత జగనన్నే మా భవిష్యత్ సంక్షేమ యాత్రను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఈ నెల 27 నుంచి నవంబరు 5 వరకు నిర్వహించనున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 27న వెన్నెలపాలెం గ్రామం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. 28న కలపాక, 29న పి.బోనంగి, దేశపాత్రునిపాలెం, 30న గొర్లివానిపాలెం, పెదముషిడివాడ, 31న పెదముషిడివాడ, నవంబరు 1న కన్నూరు, మడకపాలెం, మామిడివానిపాలెం, ఈ.మర్రిపాలెం, లంకెలపాలెం, 2న భర్నికం, తానాం, 3, 4, 5వ తేదీల్లో పరవాడ గ్రామంలో సంక్షమే యాత్ర నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నేడు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పర్యటన

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-3 సచివాలయం పరిధిలో శనివారం జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు తెలిపారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే మండలంలోని ఇరువాడలో మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలి

ఉక్కునగరం: పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలు వెయ్యి రోజులకు చేరుకుంటున్న సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్మికులను చైతన్య పరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పోరాటంలో పాల్గోవడం వల్ల మాత్రమే ప్రభుత్వం వెనక్కు వెళుతుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, మసేనురావు, బిషాయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి అవతార ప్రకటన ర్యాలీ


ఉక్కునగరంలో సత్యసాయి ర్యాలీలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సత్యసాయి అవతార ప్రకటన ర్యాలీ శుక్రవారం వైభవంగా జరిగింది. 1940 అక్టోబర్ 20న సనాతన ధర్మ పరిరక్షణ కోసం తాను అవతరించానని సత్యసాయి మొట్టమొదటసారి ప్రకటన చేశారని సత్యసాయి సమితి ప్రతినిధులు తెలిపారు. అప్పటి నుంచి సుమారు 150 దేశాల ప్రజలు ఈ రోజును అవతార ప్రకటన ర్యాలీలు నిర్వహిస్తుంటారన్నారు. అందులో భాగంగా సెక్టార్-11 నుంచి ప్రత్యేక రథంతో ప్రారంభమైన ర్యాలీని వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్ ప్రారంభించారు. వేద పఠనం, సర్వమత భజనలతో ర్యాలీ పలు సెక్టార్ల మీదుగా సత్యసాయి మందిరం చేరుకుంది. కార్యక్రమంలో సత్యసాయి కన్వీనర్ జి.రామకృష్ణ, మాజీ ఉన్నతాధికారులు ఎన్.ఎస్.రావు, ఆర్.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రదాయినీ నమోస్తుతే..

- సరస్వతీ దేవిగా దుర్గమ్మ
- పలు చోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు
- భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


విజినిగిరిపాలెంలో సరస్వతీదేవి అలంకారంలో ఉమాదేవి


అలివేలు మంగమ్మ సన్నిధిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


పంచముఖ గాయత్రీ ఆలయంలో సరస్వతీదేవిగా..


సుజాతనగర్‌లో అయ్యప్పస్వామి ఆలయంలో సరస్వతిదేవిగా కనకదుర్గమ్మ

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. భారీ ఎత్తున కుంకుమ పూజలు జరిపారు.

విజయలక్ష్మిగా అలివేలు మంగమ్మ

- చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మ విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిపారు. వందలాదిగా మహిళలు పూజల్లో పాల్గొన్నారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సరస్వతీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున కుంకుమ పూజలు జరిపారు. అక్షరాభ్యాసాలు నిర్వహించారు.


సింహగిరి పునరావుసుల లేఅవుట్‌లో సరస్వతీదేవిగా బంగారమ్మ


దొగ్గవానిపాలెం సాయి నిరంజన్ కాలనీలో అమ్మవారికి సారె ఊరేగింపు

ఘనంగా దీపారాధన

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి మండలం కోట్నివానిపాలెంలో శుక్రవారం రాత్రి దుర్గమ్మ సన్నిధిలో భారీ ఎత్తున దీపారాధన చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలించారు. ముందుగా అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు.

సారె సమర్పణ

దొగ్గవానిపాలెం సమీపంలోని సాయి నిరంజన్ కాలనీలో కొలువుదీరిన దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ వాసులు అమ్మవారి సారె ఊరేగించారు. పిండివంటలు, రకరకాల ఫలాలను అమ్మవారికి సమర్పించారు.

సరస్వతీదేవిగా అమ్మవార్లు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు శుక్రవారం ఉమాదేవి సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

- పాతగోశాల వద్ద సింహగిరి పునరావసుల లేఅవుట్‌లోని బంగారమ్మ, పాదాలమ్మ ఆలయంలో బంగారమ్మ శుక్రవారం సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కాలనీ మహిళలు, భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.


కోట్నివానిపాలెంలో దీపారాధన

వీసీ ఆచార్య సూర్యప్రకాశరావుకు ఘన సత్కారం


వీసీ ఆచార్య సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న రమణమూర్తి తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ న్యాయ కోవిదుడు, ఏయూ న్యాయ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య దాసరి సూర్యప్రకాశరావును ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ న్యాయ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కలిగిన ఆచార్య సూర్యప్రకాశరావును డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతిగా నియమించడం ప్రతిభకు పట్టం కట్టినట్లయ్యిందన్నారు. ప్రతిభ ఆధారంగా ఉపకులపతిగా ఆచార్య సూర్యప్రకాశరావును నియమించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తరాంధ్ర విద్యార్థిసేన తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత సేన అధ్యక్షుడు ఐడీబాబు, స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, కో ఆర్డినేటర్ ఎస్‌వీ రాజారెడ్డి, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ ఇన్‌చార్జి సుబుద్ధి శ్రీరామ్, కె. సూర్యనారాయణ తదితరులు సత్కరించినవారిలో ఉన్నారు.

మూడు వారాల్లో రహదారుల విస్తరణ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం


కణితి రోడ్ విస్తరణను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయింత్‌వర్మ

గాజువాక : గాజువాక జోన్‌లో చేపట్టిన రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులను మూడు వారాల్లో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటిల్లు జంక్షన్ నుంచి బీసీ రోడ్ మార్కెట్ వరకు చేపట్టిన కణితి రోడ్ విస్తరణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. మూడు వారాల్లో రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని, రోడ్డుకు సంబంధించిన అడ్డంకులను వారం రోజుల్లో సరి చేసి ఆటంకంగా ఉన్న నీటి పైపులను మార్చాలని ఆదేశించారు. దువ్వాడ స్టేషన్ రోడ్‌లో కూర్మన్నపాలెం జాతీయ రహదారి నుంచి దువ్వాడ ఫ్లైఓవర్ వద్ద పెట్రోల్ బంక్ వరకు చేపట్టిన విస్తరణ పనులతో పాటు కాలువలు, డివైడర్లు, ఫుట్‌పాత్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్‌ను అందంగా తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా సంరక్షించాలని చీఫ్ సిటీ ప్లానర్ సునీతను, ఎస్టేట్ అధికారి ఆనంద్‌ను ఆదేశించారు. పరిశీలనలో 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఎస్ఈ గోవిందరావు, ఈఈ మత్స్యరాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీలక్ష్మి తదితరులున్నారు.

సస్య రక్షణ చర్యలతో చీడపీడల నివారణ


బోనిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆనందపురం : రైతులు పంటలకు సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడలను నివారించవచ్చని భీమిలి డివిజన్ ఏడీ బి.విజయ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని బోనిలో శుక్రవారం పర్యటించిన ఆయన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటను ఎక్కువగా సుడిదోమ, పొడ తెగులు ఆశించినట్టు గుర్తించామని రైతులకు వివరించారు. సుడిదోమ నివారణకు ప్రైమ్ ట్రిజిన్ మందు ఎకరాకు 120 గ్రాములు, పొడ తెగులు నివారణకు హెక్సా కొనజాల్ మందు 400 మిల్లీలీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. తెగుళ్లు పొలమంతా వ్యాపించక ముందే మందును పిచికారీ చేస్తే పంట నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ సంధ్యారత్న ప్రభ, వీఏఏ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకల నిషేధానికి వినతి


కార్పొరేటర్ రాజాన రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గాజువాక : స్వతంత్రనగర్ వై జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్, వందడుగుల రోడ్ మీదుగా జాతీయ రహదారిపైకి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను దారి మళ్లించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు నివాస్, వార్వా, వాయిస్ ఆఫ్ గాజువాక, జన విజ్ఞాన వేదిక నాయకులు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, ఎ.జె. స్టాలిన్, పులి లక్ష్మీభాయి, గంధం శ్రీనివాసరావు, ఉరుకూటి చందు, బి.గంగారావు, దల్లి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాసరావు తదితర కార్పొరేటర్లకు శుక్రవారం వినతి పత్రాలు సమర్పించారు. గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్‌లకు చెందిన భారీ వాహనాలు బొగ్గుతో పాటు ఇతర రసాయనిక పదార్థాలను రోడ్‌పై వెదజల్లుతూ ప్రయాణిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ దారిలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను దారి మళ్లించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రాలను సమర్పించిన వారిలో వివిధ సంఘాల నాయకులు బైరెడ్డి గురప్ప, కె.కిరీటం, బి.త్రినాథస్వామి, విశ్వనాథం, దాములోతు అప్పారావు, సలాది వెంకటరమణ, ఎస్‌వీకే పరశురామ్ తదితరులున్నారు.

నేడు అమృతరావు జయంతి

ఉక్కునగరం: ఉక్కు ఉద్యమ నేత తమనంపల్లి అమృతరావు జయంతి వేడుకలను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఉక్కు హిల్‌టాప్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి యూనియన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప కోరారు.

నేటి నుంచి మిజోరం గవర్నర్ పర్యటన

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంటారు. 23వ తేదీ వరకు స్థానికంగా జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24న హైదరాబాద్ వెళ్లి అక్కడ కార్యక్రమాల అనంతరం 26న తిరిగి విశాఖపట్నం వస్తారు. 30న ఉదయం విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుంచి కోల్‌కతా మీదుగా ఐజ్వాల్ వెళ్లనున్నారు. ఈ మేరకు సంబంధిత ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉక్కు పరిరక్షణకు 8న నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా నవంబర్ 8న నిర్వహించనునన భారీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రైవేటీకరణ వ్యతిరేక నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న దీక్షలు నవేంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులకు చేరుతుందన్నారు. ఆ రోజు జరగనున్న కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా ఉండాలన్నారు. ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాటు పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో కారు రమణ, ఆకుల నూకరాజు, బీఎంకె నాయక్, నర్సింగరావు, ఆర్.కోటేశ్వరరావు, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 981వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాటం చేయడం ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదన్నారు. పోరాటాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను చేజార్చుకోబోమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం


శారదాపీఠంలో సరస్వతీపూజలో చిన్నారులు


చిన్నారికి ఆశీస్సులు అందిస్తున్న స్వామీజీ

పెందుర్తి: చినముషిడివాడలోని విశాఖ శ్రీశారదాపీఠంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అమ్మవారి మూలా నక్షత్రం పురస్కరించుకుని విశేష పూజలు జరిపారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామీజీల పర్యవేక్షణలో చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భారతావనిలో శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు కొలువుదీరిన ఏకైక క్షేత్రం విశాఖ శ్రీశారదాపీఠం అన్నారు. అమ్మవారిని ఆరాధిస్తూ ఉన్నతస్థాయికి ఎదిగినవారు ఎంతో మంది ఉన్నారన్నారు. ముఖ్యమంత్రుల నుంచి సామాన్యుల వరకు అమ్మవారి అనుగ్రహం పొందారని చెప్పారు. అమ్మవారి కృపతో చిన్నారులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాని స్వామీజీ తమ అనుగ్రహభాషణంలో పేర్కొన్నారు. నగరం నలుమూలల నుంచి ప్రముఖులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

శిబిరంలో సుమారు 582 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 20 మందిని ఉన్నత వైద్యం కోసం సిఫార్స్ చేశారు. అలాగే కంటి వైద్య శిబిరంలో 171 మంది వరకూ కంటి పరీక్షలు చేయించుకున్నారు.వీరిలో 80 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఇద్దరికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు గుల్లేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు బి. సంధ్యారాణి, జి. చంద్రశేఖర్,టి. శశిప్రియ, సీహెచ్ ఆశ తదితరులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, జగనన్న ఆరోగ్య సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్ బైలపూడి గౌరి, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు,ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు,బైలపూడి రామారావు, ఐడీ బాబు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన 'అష్టలక్ష్మీ వైభవం'

పీఎం పాలెం: దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తునికి చెందిన దర్పణ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం మహా గణపతిం భజే నృత్యాంశంతో ప్రారంభం అయింది. అష్టలక్ష్మీ వైభవం నృత్యరూపకం, లింగాష్టకం, నవదుర్గల ప్రదర్శనలు అలరించాయి. కళాకారులు శ్రీ నితీష్, గాయత్రి, కుందనత్య, మహాలక్ష్మి, స్వరూప, సాహు, అనన్య, లనీష, అనూహ్య, రోషిణి, లోకేశ్వరి, దేవీ ప్రియ తదితర 20 మంది కళాకారులు పాల్గొని తమ నృత్య కౌశలం ప్రదర్శించారు. బి. లక్ష్మీ దేవి నృత్య దర్శకత్వం వహించగా స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు

పెదగంట్యాడ: తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన 34వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పెదగంట్యాడ సంజీవ కాలనీకి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఎస్పీ చాంపియన్స్ అకాడమీకి చెందిన ప్రవల్లికా రెడ్డి (13) 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, బండారు హాసిత (16) జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించారు. కె.నందిని (14) జావెలిన్ త్రోలో 6వ స్థానంలో నిలిచింది.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి


మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కంచరపాలెం: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. కంచరపాలెం పరిధిలో ధర్మానగర్, తిక్కవానిపాలెం, ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, కె.కాలనీ ప్రాథమిక, రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలల పరిధిలో శుక్రవారం ఆమె పర్యటించారు. పలు డ్రాప్ అవుట్ల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి మానేసిన విద్యార్థులను తప్పకుండా బడికి పంపాలని వారిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. దసరా సెలవులు అనంతరం పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో ఫోన్‌లో మాట్లాడి డ్రాప్ అవుట్లు బడిలో చేరేలా బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్ఎస్ఏ సిబ్బంది గీత, సీఆర్పీలు లంక చైతన్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.